## క్లుప్తంగా

### రేపు బీఆర్‌ఎస్‌ సమావేశం

**భీమదేవరపల్లి:** మండలంలోని కొత్తకొండలోని బీఆర్‌కే ఫంక్షన్‌ హాల్‌లో బీఆర్‌ఎస్‌ మండల స్థాయి సమావేశాన్ని రేపు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ వంగ రవి, మండల బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు మార్పాటి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌, జెడ్పీ చైర్మన్‌ ఎం. సుధీర్‌కుమార్‌ హాజరు కానున్నట్లు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

### ఎన్నిక

**శాయంపేట:** రేషన్‌ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మండలంలోని కొప్పుల గ్రామ రేషన్‌ డీలర్‌ సామల మల్లయ్య ఎన్నికైనట్లు రేషన్‌ డీలర్ల సంఘం రాష్ట్ర నాయకుడు, జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా కుసుమ మల్లయ్య, జిల్లా జాయింట్‌ సెక్రటరీగా ధారబోయిన అశోక్‌, జిల్లా కమిటీ సభ్యురాలుగా చల్లా ఉమాదేవిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

### అక్రమంగా మొరం తరలింపు

**ఐనవోలు:** ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలోని కక్కిరాలపల్లి గుండా టిప్పర్ల ద్వారా మొరం తరలిపోతుంది. రాత్రి 10 గంటల తర్వాత గత 20 రోజులుగా రాంనగర్‌ గ్రామం నుంచి సిటీకి ఆరు టిప్పర్ల ద్వారా అక్రమంగా మొరం తరలిస్తున్నారని ఉప సర్పంచ్‌ బొల్లం ప్రకాష్‌ ఆరోపించారు. మడ్లపల్లి రాజు అనే వ్యక్తి సోమవారం రాత్రి 11.30 ప్రాంతంలో సిటీలో పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో మొరం తరలించే టిప్పర్‌ వేగంగా ఎదురుగా రావడంతో భయభ్రాంతులకు గురైనట్లు తెలిపారు. మంగళవారం రాజు సర్పంచ్‌ కంజర్ల రమేష్‌కు ఫిర్యాదు చేశాడు. కాగా ఈ మేరకు మంగళవారం రాత్రి వాహనాలను ఆపి డ్రైవర్లకు వార్నింగ్‌ ఇచ్చినట్లు ప్రకాశ్‌ తెలిపారు. గ్రామంలో ఇటీవల సీసీ టీవీ కెమెరాలను మామునూరు ఏసీపీ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పోలీస్‌, మైనింగ్‌, రెవెన్యూ అధికారులు సీసీ టీవీ దృశ్యాలను పరిశీలించి వాహనాలను సీజ్‌ చేసి, అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు డిమాండ్‌ చేస్తున్నారు

### బియ్యం అందజేత

**శాయంపేట:** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన అరికిల్ల ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం సర్పంచ్‌ అరికిల్ల ప్రసాద్‌ వారి కుటుంబాన్ని పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆయన వెంట ఉపసర్పంచ్‌ అర్జుల సునీతసాంబరెడ్డి, వార్డు సభ్యులు నూనె ప్రకాశ్‌, మసికె సుమన్‌, ఏనుగుల అశోక్‌, గడిపె సదయ్య, దూదిపాల బుచ్చిరెడ్డి ఉన్నారు.

### పరామర్శ

**దామెర:** మండలంలోని పులుకుర్తిలోని నాలుగవ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న గోవిందు ఆగమ్మ(80) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారు జామున మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా ప్రధానకార్యదర్శి పండుగ రజిత, ప్రాజెక్టు అధికారులు దుర్గం రజిత, మాధవి, పూలారాణి, కోమల, మండల లీడర్లు ఆగమ్మ భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆగమ్మ గత 32 సంవత్సరాలుగా ఆయాగా విధులు నిర్వహించారని ఆమె సేవలను కొనియాడారు.

### అగ్ని ప్రమాదంలో..

**నడికూడ:** మండల కేంద్రంలోని రేకుల షెడ్డుకు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కిన్నెర కొమురయ్య వ్యవసాయ పనులకు వెళ్లగా షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. స్థానికులు గుర్తించి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని సామగ్రితో పాటు, పాక్షికంగా ఇల్లు దగ్ధం అయింది. సర్పంచ్‌ ఊర రవీందర్‌ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అధికారుల దృష్టి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

### స్వాతంత్య్ర సమరయోధుడి మృతి


రాజయ్య(ఫైల్‌)

**నడికూడ:** మండలంలోని వరికోల్‌ గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ సర్పంచ్‌, సహకార సంఘం అధ్యక్షుడు దోమకుంట్ల రాజయ్య (95) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పలువురు గ్రామస్తులు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

**భీమదేవరపల్లి:** మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన ఏనుగు మల్లారెడ్డి(70)అనే రైతు మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎరువుల కోసం గ్రామ సమీపంలోని గోదాం వద్దకు వెళ్తుండగా, కొత్తకొండ నుంచి పల్సర్‌ బైక్‌పై వస్తున్న చిదురాల రమేష్‌ అనే వ్యక్తి మల్లారెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లారెడ్డి కుమారుడు సురేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


భీమదేవరపల్లి: సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్‌ సుధీర్‌కుమార్‌

**భీమదేవరపల్లి:** సావిత్రిబాయి పూలే ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ చైర్మన్‌ డాక్టర్‌ మారెపల్లి సుధీర్‌కుమార్‌ అన్నారు. మండలంలోని ముల్కనూర్‌లో దళిత కళ్యాణ వేదిక చైర్మన్‌ రేణుకుంట్ల ఎల్లయ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దళితవేదిక క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఇందులో జెడ్పీటీసీ వంగ రవి, టీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ముల్కనూర్‌ సర్పంచ్‌ కొంరయ్య, రవి, మాజీ సర్పంచ్‌ లాజరస్‌, భిక్షపతి, మల్లయ్య, ఇల్లందుల బాబు తదితరులున్నారు. ముందుగా సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదరి శ్రీనివాస్‌, మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి రమాదేవి, తిరుపతి, రమేష్‌ తదితరులున్నారు.

**ఐనవోలు:** గొప్ప మానవతావాది, సంఘ సంస్కర్త, స్త్రీల హక్కుల పోరాట యోధురాలు, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని విద్యావారధి అధ్యక్షుడు బీమళ్ల సారయ్య అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని నంది సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సావిత్రిబాయి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సేవాభారత్‌ చైర్మన్‌ అశోక్‌ అన్నారు. శ్రీనివాసరెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాసరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**ధర్మసాగర్‌:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్‌ ఏ శ్రీనివాస్‌ పాల్గొని మాట్లాడారు. సావిత్రిబాయి పూలే కృషిని వివరించారు. ఈకార్యక్రమంలో అధ్యాపక బృందం పి కనకయ్య, బాబురావు, వెంకట్‌, రాములు, సదానందం, హరిప్రసాద్‌, నిర్మల, అశోక్‌, పర్వీన్‌, లైబ్రేరియన్‌ అశోక్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** సావిత్రిబాయ్‌ పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ సాధించాలని, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షులు దామెర రాజు, కార్యదర్శి అర్షం రాంకీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో సావిత్రిబాయ్‌ పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన్ను మహేందర్‌, బొట్ల కుమార్‌, బయ్యా తిరుపతి, కుక్కల రఘుపతి, కాడబోయిన మొగిలి, వారికెల రామకృష్ణ, నాగెల్లి శ్యామ్‌ పాల్గొన్నారు.


పరకాలలో..


శాయంపేటలో..

**ఎల్కతుర్తి:** సావిత్రిబాయి పూలే జయంతిని మంగళవారం మండల కేంద్రంలో పలు సంఘాల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శనిగరం వెంకటేష్‌, మేకల సంపత్‌, పాక రమేష్‌, సాతూరి వెంకన్న, భిక్షపతి, రాజ్‌కుమార్‌, చంద్రమౌళి, కుమాస్వామి పాల్గొన్నారు.

**శాయంపేట:** చదువుల తల్లి సావిత్రిబాయి పూలె జయంతిని మంగళవారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘీక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్‌ సుభాషిణి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**రక్తదాన శిబిరం**

సావిత్రిబాయి పూలె జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబేడ్కర్‌ విద్యార్థి సమాఖ్య, అంబేడ్కర్‌ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా 100మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్‌ ప్రశాంత్‌ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ అనిత, సబ్‌ ఇంజనీర్‌ చొక్కారావు, అంబేడ్కర్‌ విద్యార్థి సమాఖ్య, యువజన సంఘం నాయకులు నాగుల పవన్‌కళ్యాణ్‌, కొమురయ్య, సుమన్‌, ప్రసాద్‌, శ్రీకాంత్‌, విజయ్‌, రాజు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పత్తిపాక గ్రామంలో సావిత్రిబాయి పూలె జయంతిని సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆమె చిత్రటానికి సర్పంచ్‌ చిట్టిరెడ్డి రాజిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**పరకాల:** తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సావిత్రిబాయి పూలే జయంతిని విద్యాసంస్థలు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పరకాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌ నాయకులు నివాళులు అర్పించగా, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సంతోష్‌కుమార్‌, పరకాల ప్రధాన కూడలిలో బీఎస్పీ నాయకులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఇందులో పలువురు పాల్గొన్నారు.

### అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

**ఆత్మకూరు:** గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా విజిలెన్స్‌ అధికారి నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని నాగయ్యపల్లెలో ఆయన మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంతోపాటు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అందరూ రాజకీయాలకు అతీతంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజేందర్‌ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు ఘనసన్మానం

**ధర్మసాగర్‌:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వర్‌ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జన్మదినం పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్‌ మాట్లాడుతూ ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలన్నా స్త్రీ, పురుష భేదం లేకుండా విద్యాపరంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ సదస్సులో బాలిక విద్యపై సావిత్రిబాయి పూలే చేసిన ఉద్యమాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు అనిత, శ్రీదేవి, కిరణ్మయి, రాజమ్మ, డాక్టర్‌ పద్మజలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మప్రకాష్‌, సురేష్‌, సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాయకులను విమర్శిస్తే సహించేది లేదు


మాట్లాడుతున్న జితేందర్‌ రెడ్డి

**దామెర:** నిబద్ధతతో ప్రజాసేవ చేసే బీజేపీ నాయకులను విమర్శిస్తే సహించేదిలేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ మండల స్థాయి నాయకులు మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ పెసరు విజయచందర్‌రెడ్డి సహా ఇతర నాయకులపై అనుచిత వ్యాఖ్యలతో అవాకులు, చెవాకులు పేలితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో ప్రజలు ఎవరికి పట్టంకడతారో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని సవాల్‌ విసిరారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేసిన అభివృద్ధి తాముచేసినట్లు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు మాట్లాడుతూ అధికార పార్టీ విస్మరించిన హామీలను ఎండగట్టారు. నాయకులు పీసం రమణారెడ్డి, గంకిడి బుచ్చిరెడ్డి, మాదారపు రతన్‌కుమార్‌, దామెరప్పుల నాగరాజు, దేవేందర్‌, ఎక్కలదేవి రమేష్‌, కొమురయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల కోసం రూ.15వేల విరాళం


ఇన్‌స్పెక్టర్‌, ఎస్సైలను సన్మానించి విరాళం అందజేస్తున్న మునీందర్‌, వీరభద్రయ్య

**కమలాపూర్‌:** నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం కరీంనగర్‌ జిల్లా జమ్మికుంటకు చెందిన ఉప్పుల బతుకమ్మ కమలాపూర్‌ పోలీసులకు రూ.15 వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆమె తరపున కమలాపూర్‌కు చెందిన ఆమె బంధువులు కొనిశెట్టి మునీందర్‌, నూక వీరభద్రయ్య మంగళవారం పోలీస్‌ ఇన్‌స్పెక్టర్‌ బొలిమల్ల సంజీవ్‌కు అందజేశారు. అదేవిధంగా గతేడాది ఆగష్టులో కమలాపూర్‌లో జరిగిన చైన్‌స్నాచింగ్‌ కేసును త్వరితగతిన ఛేదించి చోరీకి గురైన బంగారు ఆభరణాలను ఇప్పించినందుకు ఇన్‌స్పెక్టర్‌ సంజీవ్‌, ఎస్సైలు చరణ్‌, సతీష్‌లను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## బేస్‌బాల్‌ పోటీలో విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

**ధర్మసాగర్‌(వేలేరు):** వేలేరు మండలంలో గల మల్లికుదుర్ల గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులు డిసెంబర్‌ నెల 26 నుంచి 30 వరకు కేరళలోని కోజికోడ్‌ జిల్లా కోడంచెరిలో జరిగిన జాతీయ స్థాయి బేస్‌బాల్‌ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో కె శ్రావణి, ఎం సాత్విక, కె సినయ్‌, జె శ్రీరామ్‌ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. మొదటి స్థానం కేరళ రాష్ట్రంకు రాగా రెండవ స్థానం మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి రావడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని అధ్యక్షతన మంగళవారం జరిగిన అభినందన సమావేశంలో గ్రామ సర్పంచ్‌ గోదల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల వలన మంచి భవిష్యత్‌ ఉంటుందని, ఇంకా మరిన్ని పతకాలు సాధించాలని, క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలని సూచించారు. ఇందుకు ఎంతగానో కృషి చేసిన పీఈటీ సుమలతను అభినందించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్‌ గోవింద సురేష్‌, నార్లగిరి ప్రవీణ్‌, బొజ్జ రవీందర్‌ యాదవ్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## పొగ 'మంచులా' మురిపించింది




ఎల్కతుర్తి మండల కేంద్రాన్ని మంగళవారం ఉదయం దట్టమైన పొగమంచు ఆవరించింది. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. దారి కనిపించకపోవడంతో వాహనాలకు హెడ్‌లైట్లు వేసుకొని వెళ్లాల్సి వచ్చింది. మరోవైపు కొత్తగా నాట్లు వేసిన ప్రాంతాలపై పొగమంచు ఆవరించడంతో కొంతమంది వాహనదారులు అందమైన దృశ్యాలను తమ మొబైల్లో భద్రపరుచుకున్నారు.

-ఎల్కతుర్తి

# ఉపాధ్యాయులు మెళకువలు పాటించాలి


బోధన కృత్యాలను పరిశీలిస్తున్న ఏఎంఓ


భీమదేవరపల్లి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవి



దామెరలో..

**ఆత్మకూరు:** ఉపాధ్యాయులు బోధనలో మెళకువలు పాటించాలని జిల్లా ఏఎంఓ రవికుమార్‌ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో మంగళవారం అభ్యసన కృత్య మేళా జరిగింది. ఉపాధ్యాయులు తయారు చేసిన వాటిలో 20 బోధన కృత్యాలను ఉత్తమంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం నిర్మలకుమారి, ఉపాధ్యాయులు సురేందర్‌, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

**భీమదేవరపల్లి:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని జెడ్పీటీసీ వంగ రవి సూచించారు. మండల స్థాయి ఎఫ్‌ఎల్‌ఎన్‌ తొలిమెట్టు కార్యక్రమాన్ని భీమదేవరపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యనందిస్తూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ఇందులో మండల కోఆప్షన్‌ సభ్యుడు ఎస్డీ షరిఫొద్దిన్‌, ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, తొలిమెట్టు నోడల్‌ అధికారి సునీతరాణి, కుమారస్వామి, ఝాన్సీ, ప్రభాకర్‌ ఉన్నారు. ఈ సందర్భంగా టీఎల్‌ఎం మేళాను నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

**శాయంపేట:** మండలంలోని పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్‌ పరిధిలోని 11పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొని ఆంగ్లము, గణితము, తెలుగు, పరిసరాల పరిజ్ఞానం మొదలగు విషయాలలో విద్యార్థులకు నాలుగు ఎగ్జిబిట్స్‌ ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి నోడల్‌ ఆఫీసర్‌ వెంకటేశ్వర్‌ రావు, కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఆర్పీలుగా శ్రీధర్‌, రఘు, న్యాయ నిర్ణేతలుగా భాస్కర్‌రావు, కిరణ్మయి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు వంశీ, నిర్మల ఉన్నారు.

**దామెర:** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంపొందించాలని ఎంపీపీ కాగితాల శంకర్‌ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి టీఎల్‌ఎం మేళా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠ్యాంశాలను విద్యార్థులు సులభంగా అర్థమయ్యేరీతిలో ఎగ్జిబిట్లు ప్రదర్శిస్తూ బోధన చేయాలని అన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, సర్పంచ్‌ శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీ కృపాకర్‌ రెడ్డి, బాబూరావు ఉన్నారు.

**ఐనవోలు:** మండల కేంద్రంలో నేడు(బుధవారం) నిర్వహించనున్న టీఎల్‌ఎం మండల మేళాను విజయవంతం చేయాలని ఎఫ్‌ఎల్‌ఎన్‌ నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ టి రమేష్‌ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో టీఎల్‌ఎం మండల మేళాకు సంబంధించిన సన్నాహక సమావేశం జరిగింది. ఈసందర్భంగా మండల మేళాను ఎలా నిర్వహించాలో కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయులు, స్టాంగ్‌ టీచర్లకు రమేష్‌ సూచించారు. మండలంలోని ఉపాధ్యాయులందరూ తమతమ ఎగ్జిబిట్లను ప్రదర్శించాలని కోరారు. సమావేశంలో మండల నోడల్‌ ఆఫీసర్‌ రామకృష్ణ, కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయులు శ్రీహర్షుడు, మాధవి, రిసోర్స్‌ పర్సన్‌ సీహెచ్‌ లింగారావు, బ్రహ్మచారి, జయేందర్‌రెడ్డి, మనోహర్‌రావు, స్వప్న, అశోక్‌ వర్ధన్‌ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, సీఆర్‌పీ రాజు ఉన్నారు.

### జవాబుదారీతనం పెంచేందుకు సోషల్‌ ఆడిట్‌


సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ, అధికారులు

**దామెర:** ప్రజాపనుల్లో జవాబుదారీతనం పెంచేందుకు సోషల్‌ ఆడిట్‌ ఉపయోగపడుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు గరిగె కల్పనక్రిష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం సోషల్‌ ఆడిట్‌ బృందం, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పనులపై నిర్వహించే తనిఖీ బృందానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని అన్నారు. ఎంపీడీఓ ఎం. వెంకటేశ్వర్‌ రావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తున్న సమయంలో,ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు.

## పీఆర్టీయూ క్యాలెండర్‌ ఆవిష్కరణ


క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**ధర్మసాగర్‌:** మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాలలో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించి అనంతరం క్యాలెండర్‌ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం పరితపించే సంఘం అని, ఉపాధ్యాయుల పదోన్నతి షెడ్యూల్‌ను ఇప్పించే బాధ్యత కూడా పీఆర్‌టీయూదేనని తెలిపారు. ఇందులో పలువురు నాయకులు పాల్గొన్నారు.

**ఐనవోలు:** పీఆర్‌టీయూటీఎస్‌ ఐనవోలు మండల శాఖ ఆధ్వర్యంలో క్యాలెండర్‌, టేబుల్‌ క్యాలెండర్‌లను వరంగల్‌ డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి ఆవిష్కరించారు. ఇందులో పలువురు ఉన్నారు.

**కమలాపూర్‌లో..**

**కమలాపూర్‌:** పీఆర్టీయూ టీఎస్‌ ఆధ్వర్యంలో ముద్రించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్లను పీఆర్టీయూ టీఎస్‌ మండల అధ్యక్షుడు పటేల్‌ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శీలం ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో ఎంపీడీఓ జి.పల్లవి కమలాపూర్‌ మండల ప్రజాపరిషత్‌ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు.

**పరకాలలో..**

**పరకాల:** కొత్త సంవత్సరంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పించేందుకు పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి అన్నారు. పరకాల పట్టణంలోని అమరధామంలో మంగళవారం పీఆర్టీయూ టీఎస్‌ 2023 క్యాలెండర్‌ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## జెడ్పీ నిధులతో పంథినిలో రెండు బోర్లు


పనులు ప్రారంభించిన జెడ్పీ వైస్‌ చైర్మన్‌

**ఐనవోలు:** మండలంలోని పంథిని గ్రామంలో గ్రామస్తుల కోరిక మేరకు రైతు వేదిక, ఎస్సీ కాలనీ వద్ద రెండు బోర్లు వేయించినట్లు జెడ్పీ వైస్‌ చైర్మన్‌ గజ్జెల శ్రీరాములు అన్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామ సర్పంచ్‌ కరిముల్ల ప్రేమలత, ఎంపీటీసీ సోమేశ్వర్‌రావులతో కలిసి శ్రీరాములు పనులు ప్రారంభించారు. బోరు నీళ్లు పడడంతో త్వరలో మోటర్‌ బిగింపు చేపట్టనున్నట్లు తెలిపారు. బోర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్‌ కంకర శ్రీనివాస్‌, కరిముల్ల పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.